సాక్షి మంచిర్యాల

బుధవారం । 8 । అక్టోబర్ । 2025



వన్యప్రాణుల నిలయం.. కవ్వాల్
వివిధ రకాల వన్యప్రాణులకు కవ్వాల్ అభయారణ్యం నిలయంగా ఉంది. వన్యప్రాణుల సంరక్షణకు ఏటా వారోత్సవాలు నిర్వహిస్తుండగా.. నేటితో ముగియనున్నాయి. 8లో▸



క్వార్టర్లు కూలుతున్నయ్
సింగరేణి క్వార్టర్ల మరమ్మతుల్లో అధికారులు జాప్యం చేస్తున్నారు. సివిల్, ఎలక్ట్రికల్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.0 /24.0
ఆకాశం మధ్యాహ్నం వేళ ప్రకాశవంతంగా.. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఎంసీహెచ్‌లో 24 గంటల్లో 24 ప్రసవాలు



చిన్నారులతో వైద్యులు, వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో మంగళవారం అరుదైన రికార్డు నెలకొల్పారు. ఈ నెల 6న ఉదయం 9 గంటల నుంచి 7న ఉదయం 9 గంటల వరకు 24 ప్రసవాలు చేశారు. ఆన్‌డ్యూటీ డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ హారిక ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ఆరు సాధారణ ప్రసవాలు, 18 సిజేరియన్‌లు చేశారు. మొత్తంగా 24 గంటల్లో 24 ప్రసవాలు చేసి ఘనతను సాధించారు. చిన్నారులు, తల్లులు క్షేమంగా ఉన్నారని వైద్యులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. వైద్య బృందంలో ప్రొఫెసర్ హిమబిందు, అసోసియేట్ ప్రొఫెసర్ మాధవి, వైద్యులు అలివేణి, కీర్తి, ప్రశాంతి, ప్రియదర్శిని, సింధూజ, మిడ్‌వైఫ్స్ అలివేలు పుష్ప, సంధ్య, సౌందర్య, సువర్ణ ఉన్నారు. వైద్యులు, వైద్య సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఆర్‌ఎంవోలు భీష్మ, శ్రీధర్ అభినందించారు.

పార్కుల్లోని పిచ్చిమొక్కల తొలగింపు



రెడ్డికాలనీ పార్కులో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు ఒక్కో పార్కుకు రూ.లక్షలు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అయినా ఆహ్లాదం అందకుండా పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'పార్కులపై పట్టింపేది..!' శీర్షికన ఈ నెల 5న సాక్షిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ కమిషనర్ సంపత్‌కుమార్ స్పందించారు. మంగళవారం పాత మంచిర్యాలలోని పార్కును పరిశీలించారు. పిచ్చిమొక్కలను తొలగించే పనులు, ఆహ్లాదం కోసం చేపట్టాలిస్న పనులపై సమీక్షించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సెలవు రోజుల్లో చిన్నారులు ఆడుకునేందుకు, పార్కుల సందరీకరణ చేపట్టి ఆహ్లాదాన్ని అందించేలా సిద్ధం చేయాలని సూచించారు.

బాణాసంచా దుకాణాల్లో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: బాణాసంచా దుకాణాల్లో నిబంధనలు పాటించాలని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లాలోని లైసెన్స్‌డ్ టపాసుల నిర్వాహకులతో పట్టణంలోని ఎం కన్వెన్షన్ హాలులో ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాసులు కొనడానికి మహిళలు, చిన్నపిల్లలు పెద్దమొత్తంలో వస్తుంటారని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మంచిర్యాల డిగ్రీ కళాశాల, నస్పూర్ గ్రౌండ్‌లో దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని తెలిపారు. మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఇంచార్జి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సత్యనారాయణ, ఎస్సైలు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

పాతమంచిర్యాల: బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాచప్పన్ కమిషన్, మండల కమిషన్, పార్లమెంట్ స్టాండింగ్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసులు చేసినప్పటికీ బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు కావడం లేదన్నారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నెన్నెల నర్సయ్య, నాయకులు టి.మధుసూదన్, జి.వెంకటయ్య, శాఖపురి భీంసేన్, భిక్షపతి పాల్గొన్నారు.

హరిత బడి.. లక్ష్యానికి దూరం..!

- నత్తనడకన స్కూళ్ల రేటింగ్ నమోదు
- జిల్లాలో 76.27శాతం పూర్తి
- మిగిలింది వారం రోజులే..



పాక్కూర్ పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు పెంపొందించి విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్య భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయాల రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్) పేరిట ప్రత్యేక పురస్కారాలు అందించనుంది. మూత్రశాలల వినియోగం, నీటి వసతి, మొక్కలు నాటి సంరక్షణ తదితర అంశాలు అమలు చేస్తున్న పాఠశాలలకు రేటింగ్ ఇచ్చి పురస్కారాలు అందజేయనున్నారు. ఇప్పటికే ఎస్‌హెచ్‌వీఆర్ కార్యక్రమంపై ఆయా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సెప్టెంబర్ ఒకటి నుంచి 30వరకు పాఠశాలల వారీగా ఎస్‌హెచ్‌వీఆర్ యాప్, వెబ్‌సైట్‌లో యూడైస్ కోడ్‌తో లాగిన్ అయి నమోదు చేయాల్సి ఉన్నా ఆసక్తి చూపకపోవడంతో లక్ష్యానికి దూరంగా నిలుస్తోంది. ఈ నెల 5వరకు రాష్ట్రంలో కామారెడ్డి, కొత్తగూడెం జిల్లాలు బడుల రేటింగ్ నమోదు వంద శాతం పూర్తి చేసి ముందు వరుసలో నిలిచాయి. జిల్లాలో 76.27శాతమే పూర్తయింది. మిగతా వాటి నమోదుకు ఈ నెల 15వరకు అంటే మరో వారం రోజులే గడువు వుంది.

రూ.లక్ష వరకు నగదు పురస్కారాలు

అప్‌లోడ్ చేసిన చిత్రాలను కమిటీ బృందం తనిఖీ చేస్తుంది. త్రీ స్టార్ వచ్చిన పాఠశాలలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా జిల్లాలో వివిధ కేటగిరీల ఆరు పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో ఫోర్ స్టార్ వచ్చిన వాటిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. దేశంలో అత్యుత్తమంగా ఉన్న 200 పాఠశాలలకు స్వచ్ఛ ఏవమ్ హరిత పురస్కారం అందజేస్తారు. రూ.లక్ష నగదుతోపాటు ఉపాధ్యాయులను విహార యాత్రకు తీసుకెళ్తారు.

చొరవ చూపితేనే..

జిల్లాలో 1045 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,27,834 మంది విద్యార్థులు ఉన్నారు. 2014నుంచి 2020 వరకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, తదితర అంశాల్లో స్వచ్ఛత పురస్కారాలు అందించిన ప్రభుత్వం ఐదేళ్ల తర్వాత తిరిగి స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్‌తో బడులకు ప్రత్యేక పురస్కారాలు అందించనుంది. పాఠశాలల యాజమాన్యాలు స్కూల్ రేటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, పచ్చదనం, పరిశుభ్రత తదితర పాఠశాల నిర్వహణపై ఆన్‌లైన్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 5 వరకు జిల్లాలో 1045 పాఠశాలలకుగాను 914 పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేసుకోగా 797(76.27శాతం) మాత్రమే వివరాలు, చిత్రాల అప్‌లోడ్ చేశాయి. నీటి సంరక్షణ, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మొక్కలు, తోటల పెంపకం, సౌరశక్తి వినియోగం తదితర అంశాలకు మార్కులు కేటాయిస్తారు. బడుల రేటింగ్‌కు ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని నమోదు చేయాల్సి ఉంది.

దరఖాస్తు గడువు పెంపు

స్వచ్ఛ ఏవమ్ హరిత స్కూల్ రేటింగ్ కార్యక్రమంపై ఆయా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాం. సెప్టెంబర్ 4నుంచి 30వరకు నమోదు కార్యక్రమం ఉండగా మరోసారి 15వరకు గడువు పెంచారు. గడువు కంటే ముందుగానే అన్ని బడుల రేటింగ్ నమోదు ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపడుతాం.
– డీఈవో యాదయ్య

స్థానిక తీర్పుపై ఉత్కంఠ

- నేడు హైకోర్టులో బీసీ రిజర్వేషన్లపై విచారణ
- ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పుపైనే అందరి దృష్టి నెలకొంది. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లపై మంగళవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల అమలుపై ఎలాంటి తీర్పు వస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో రాజకీయ నాయకులతోపాటు బీసీ సంఘాలు, ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజలు ఎలాంటి ఆదేశాలు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధం కావడంతో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 9న పరిషత్ ఎన్నికల్లో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ మేరకు జిల్లాలోనూ మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే పలుమార్లు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ బూత్‌లు తదితర అన్ని సౌకర్యాలు కల్పించారు. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ మేరకు జిల్లాలోనూ కోడ్ అమలు చేస్తున్నారు.

గ్రీన్‌సిగ్నల్ వచ్చేనా?

గత రెండేళ్లుగా పాలకవర్గాలు లేక స్థానిక సంస్థల్లో నిధులు రాక, పరిపాలన సాగక అభివృద్ధి కుంటుపడుతోంది. ఎట్టకేలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలులో భాగంగా ఆయా స్థానాలకు రిజర్వు చేశారు. అయితే హైకోర్టులో కేసులు వేయడంతో నోటిఫికేషన్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోతోందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం ఎన్నికలు జరుగుతాయనే ధీమాతో ఉన్నారు. సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో హైకోర్టులోనూ అనుకూలంగా ఆదేశాలు వస్తాయని చెబుతున్నారు. ఇక ప్రతిపక్ష పార్టీ నాయకులు మాత్రం సందిగ్ధం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు ఇంకా కసరత్తు జరుగుతుండగా, గ్రామాల్లో కేడర్‌ను సన్నద్ధం చేశారు. కాంగ్రెస్ పార్టీలో మాత్రం నాయకులు తమకే టికెట్ ఇవ్వాలంటూ ఎమ్మెల్యేల వద్దకు వెళ్తున్నారు. కోర్టు నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే కదన రంగంలోకి దూకుదామనే ఆలోచనతో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు నుంచి సానుకూల ఆదేశాలు వస్తే ఎన్నికలు నిర్వహించడం సులువవుతుంది. లేకపోతే రిజర్వేషన్లు మళ్లీ మార్చి ముందుకు వెళ్లడం, లేకపోతే పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలు చేసే యోచనతోనూ ఎన్నికలు జరుపుతారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

మంచిర్యాలక్రైం: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం ఉన్నంత వరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందని అన్నారు. రామాయణం సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యాన్ని బోధించిన అమృత గ్రంథమణి అన్నారు. డీసీపీ ఏ.భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

పంటలు వరదపాలు

- రైతులను నిండా ముంచిన అధిక వర్షాలు
- రాలిపోతున్న పత్తికాయలు
- నెల రోజుల్లో రెండోసారి దెబ్బతిన్న పత్తి, మిర్చి



చెన్నూర్ గోదావరి పరీవాహక ప్రాంతంలో మురిగిన పత్తికాయలు

చెన్నూర్: ఎడతెరిపి లేని వర్షాలు రైతులను నిండా ముంచుతున్నాయి. నెల రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. గత రెండు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు చెన్నూర్, కోటపల్లి, జైపూర్ మండలాల్లో 2,350 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరో నెల రోజుల్లో పత్తి పంట దిగుబడి చేతికి వచ్చేది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరోసారి పత్తి, మిర్చి పంటలు నీట మునిగాయి. పత్తి కాయ, పూత రాలిపోతోంది. పత్తి చేన్లు నీట మునగడంతో కాయ మురిగి రాలిపోతున్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చేదని ఆందోళన చెందుతున్నారు. గత నాలుగేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పంటలను ముంచేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా బ్యాక్‌వాటర్ చెన్నూర్, జైపూర్, కోటపల్లి మండలాల్లో పంటలు నీటమునిగాయి. గత నెలలో కురిసిన వర్షాలకు 50శాతం పంటలకు నష్టం వాటిల్లగా..అక్టోబర్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు గోదావరి పరీవాహక ప్రాంతాల్లో 20శాతానికి పైగా పంటలు నాశనమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివేదిక సమర్పించాం..

గత నెలలో వర్షాలకు 2,223 మంది రైతులకు చెందిన 2,350 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాం. గత వారం రోజులగా కుస్తున్న వర్షాలకు పత్తి పంటకు నష్టం జరిగింది. వరద ముంపు చెన్నూర్ డివిజన్‌లో జైపూర్, చెన్నూర్, కోటపల్లి మండలాలకే ఎక్కువగా ఉంటుంది. పోయిన నెలలో దెబ్బతిన్న పంటలే ఈసారి కూడా దెబ్బతిన్నట్లు తెలిసింది.
– బానోత్ ప్రసాద్, ఏడీఏ చెన్నూర్

పత్తి నాశనమైంది..



మరో నెల రోజుల్లో పత్తి దిగుబడి వచ్చేది. పోయిన నెలలో కురిసిన వర్షాలకు 30శాతం పత్తి నాశనమైంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాయ మురిగిపోయి రాలిపోతుంది. నెల రోజుల వ్యవధిలోనే పంట నీట మునగడంతో తీవ్రంగా నష్టం జరిగింది. చేతికొచ్చిన పంట నీటిపాలవడంతో అప్పులు ఎలా తీర్చేది. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.
–తడకల మహేశ్, రైతు, చెన్నూర్

20ఎకరాలు కౌలుకు తీసుకున్నా




నాకు సొంతంగా పది ఎకరాలు ఉంది. మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. భారీ వర్షాలు పంటను నాశనం చేశాయి. రూ.7 లక్షలు పెట్టుబడి పెట్టాను. వర్షాలకు పూర్తిగా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఎకరానికి పది నుంచి 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చేది.. ఈ ఏడాది ఎకరానికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదు. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.
–భూతం సంతోష్, రైతు

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీసీపీ ఏ.భాస్కర్, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్‌తో కలిసి రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 16జెడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి విడతకు ఈ నెల 9 నుంచి 11వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. 12న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల జాబితా, 13న అప్పీళ్ల స్వీకరణ, 14న పరిష్కారం, 15న ఉపసంహరణ, బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన, 23న పోలింగ్, నవంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉంటాయని వివరించారు. నామినేషన్లు క్షుణ్ణంగా పరిశీలించాలని, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.



పూలమాల వేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మహనీయుల ఆశయాలు స్ఫూర్తిదాయకం

మంచిర్యాల అగ్రికల్చర్: మహనీయుల ఆశయాలు మనందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి, కుమురం భీం వర్ధంతి వేడుకల్లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మొహమ్మద్ విలాయత్ అలీ, అధికారులతో కలిసి పాల్గొన్నారు. వాల్మీకి, కుమురంభీం చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచి పోరాడిన వీర యోధుడు, ఆదివాసీల ముద్దుబిడ్డ కుమురం భీం అని అన్నారు. ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు.

పులకించిన పోరుగడ్డ



భీం సమాధిపై పూలు చల్లుతున్న మంత్రులు కృష్ణారావు, లక్ష్మణ్‌కుమార్



భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

- ఘనంగా కుమురం భీం 85వ వర్ధంతి
- జోడేఘాట్‌లో సంప్రదాయ పూజలు
- మంత్రులు 'జూపల్లి', 'అడ్లూరి' హాజరు
- 'కోడ్'తో వేదిక ఎక్కని అమాత్యులు
- సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం

కెరమెరి(ఆసిఫాబాద్): జల్.. జంగల్.. జమీన్ కోసం పోరుసలిపి అసువులు బాసిన ఆదివాసీ పోరాట యోధుడు కుమురంభీం స్మరణతో పోరుగడ్డ పులకించింది. రణభూమి జోడేఘాట్‌లో వీరుడి 85వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై భీం విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన సమాధిపై పూలు చల్లి నివాళులర్పించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు వేదికపైకి ఎవరూ వెళ్లలేదు. దర్బార్ కార్యక్రమాన్ని రద్దు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరికి వారుగా వచ్చి నివాళులర్పించి వెళ్లిపోయారు.

భీం స్ఫూర్తితో ముందుకు సాగుదాం: కలెక్టర్

ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కుమురం భీం స్ఫూర్తితో ముందుకు సాగుదామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడతామని పేర్కొన్నారు. భీం వర్ధంతికి ఉచిత బస్సు సౌకర్యం, భోజనం తదితర వసతులు కల్పించామని చెప్పారు. అనంతరం భీం మనుమడు కుమురం సోనేరావు కుటుంబానికి కలెక్టర్ నూతన వస్త్రాలు అందించారు.

భీంకు సంప్రదాయపూజలు

కుమురంభీంకు ఆయన వారసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సంప్రదాయ పూజలు నిర్వహించారు. భీం సమాధిపై పూలు చల్లి పూజలు చేశారు. ముందుగా ఆచార, వ్యవహారాలతో పాత జెండాలు తీసేసి కొత్త జెండాలు ఆవిష్కరించారు. అంతా వరుసక్రమంలో నిల్చుని జెండాలకు మొక్కారు. ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. కోడి, మేకలతో జాతకం చూశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పాటగూడ, జోడేఘాట్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గుస్సాడీ నృత్యాలు కనువిందు చేశాయి. ఐసీడీఎస్, రెవెన్యూ, ఐటీడీఏ, సఖీ, వైద్యారోగ్యశాఖ, కొలాం అభివృద్ధి, ఇప్పపూలు, విస్తరాకుల తయారీ తదితర స్టాళ్లు ఎంతోగానో ఆకట్టుకున్నాయి.

నివాళులర్పించినవారిలో..

'స్థానిక' ఎన్నికల కోడ్ నేపథ్యంలో దర్బార్ రద్దు చేయగా భీం ఆరాధికులు అనుకున్న స్థాయిలో హాజరు కాలేదు. మంత్రులు, కలెక్టర్‌తోపాటు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ కాంతిలాల్‌పాటిల్, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఆర్డీవో లోకేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, డీడీ రమాదేవి, ఎంపీ నగేశ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, భీం మనుమడు కుమురం సోనేరావు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణ, నాయకులు విశ్వప్రసాద్, శ్యాంనాయక్ తదితరులు భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించినవారిలో ఉన్నారు.

భీం ఆశయాలు నెరవేర్చుతాం: మంత్రులు

కుమురం భీం ఆశయాలు నెరవేర్చుతామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివాసీలను సంఘటితం చేసి వారి హక్కుల సాధనకు పోరాడిన వీరుడు కుమురంభీం అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన స్ఫూర్తి ఎంతో ఉందని పేర్కొన్నారు. 1935 నుంచి నిజాంకు వ్యతిరేకంగా పోరాడి వారి బలగాలను ఎదురించారని తెలిపారు. ఆదివాసీల అభివృద్ధికి రూ.740 కోట్లతో రోడ్లు, గిరిజన భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందని చెప్పారు. విద్య, ఆశ్రమ పాఠశాలలను మరింత తీర్చి దిద్దుతామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా వేదికపై మాట్లాడలేకపోతున్నామని చెప్పారు.

వన్యప్రాణుల గణన సర్వేపై అవగాహన

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో అటవీ శాఖ ఉద్యోగులకు వన్యప్రాణుల గణన సర్వేపై జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, ఫీల్డ్ బయాలజిస్ట్ కవ్వాల్ టైగర్ రిజర్వు ఎల్లం మంగళవారం అవగాహన కల్పించారు. నాలుగేళ్లకోసారి దేశంలో వన్యప్రాణుల గణన చేస్తుందని, ఈ సర్వే గణాంకాలు ప్రధాన మంత్రికి తెలియజేస్తారని తెలిపారు. అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించాలని సూచించారు. మాంసాహార, శాఖహార జంతువులకు సంబంధించి వివిధ రకాల నమూనాలను సేకరించే కార్యక్రమంలో జంతువులు, వృక్ష సంపద ఉనికిని తెలియజేసే విధంగా ఈ సర్వే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ డివిజన్ల క్షేత్ర అధికారులు, ఉపక్షేత్ర అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణే లక్ష్యంగా ముందుకెళ్లాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఫైలేరియా(బోదకాలు) కేసులు పెరుగుతున్నాయని, నివారణే లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖ ముందుకెళ్లాలని కేంద్ర కీటక జనిత వ్యాధుల రీజినల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మంగళవారం టాస్ కార్యక్రమంపై శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో 20 బృందాలు ఏర్పాటు చేసి ఈ నెల 13 నుంచి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 20 ఏళ్ల పైబడిన ప్రతీ ఒక్కరికి ఫైలేరియా పరీక్ష చేసి బాధితులకు మందులు అందజేస్తామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 892 ఫైలేరియా కేసులు ఉన్నాయని, అందుకే జిల్లాను ఎండమిక్ ఏరియాగా గుర్తించి, టాస్‌ను ఏర్పాటు చేసి, సర్వేను నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, డాక్టర్ సునిల్ కుమార్, జోనల్ మలేరియా అధికారి సైదులు, కీటక జనిత వ్యాధుల రాష్ట్ర కన్సల్టెంట్ నాగయ్య, డాక్టర్ సుధాకర్‌నాయక్, డాక్టర్ ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీపీవో ప్రశాంతి, డీపీహెచ్‌ఎన్ నాందేవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర కీటక జనిత వ్యాధుల రీజినల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ

క్లుప్తంగా

పశువుల వాహనం పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం చెక్ పోస్ట్ మీదుగా మంగళవారం అక్రమంగా పశువులను తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా 26 పశువులను ఐచర్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో ఒక ఆవు ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి షకీల్, ఇర్ఫాన్, అసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

కడెం: మండల కేంద్రానికి చెందిన షేక్ రఫీక్ కుమార్తె షేక్ రిబాపై కోతులు దాడి చేశాయి. మంగళవారం చిన్నారి ఇంటివద్ద ఆడుకుంటుండగా ఒక్కసారిగా కోతులు దాడి చేయడంతో చేతికి గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కోతుల బెడద అరికట్టాలని ఇటీవలే పలువురు మహిళలు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఇప్పటికైనా కోతుల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

108లో ప్రసవం


చిన్నారిని అందిస్తున్న ఈఎంటీ రాజశేఖర్

ఇంద్రవెల్లి: సిరికొండ మండలంలోని కన్నాపూర్‌తండాకు చెందిన పూర్ణకు మంగళవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. స్పందించిన అంబులెన్స్ సిబ్బంది గర్భిణిని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. వడగాం సమీపంలో వాహనాన్ని ఆపి ఈఎంటీ రాజశేఖర్ ప్రసవం చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించినట్లు పైలట్ రవీందర్ తెలిపారు.

యువకుడు అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాటిగూడకు చెందిన మహ్మద్ అర్బాజ్ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 5న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం యువకుని తండ్రి మహ్మద్ జావిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. బస్టాండ్ ఎదుట గల వైన్స్‌షాపుల నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి బెల్టుషాపుల ద్వారా అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరాం కాలనీకి చెందిన పెద్దపల్లి సాయితేజ, ఇందిరానగర్‌కు చెందిన మర్కర్వార్ గజానంద్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గజానంద్ వద్ద నుంచి 2 లీటర్ల మద్యం, సాయితేజ వద్ద నుంచి రూ.90వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ప్రశాంత్ జీవన్‌పాటిల్‌ను కలిసిన సభ్యులు

మంచిర్యాలటౌన్: ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని టీఎన్జీవోస్ సభ్యులు మంగళవారం జిల్లాకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను కోరారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ సత్యరాజ్ చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విష్ణు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుమార్, జి.వెంకటరమణ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు శివప్రసాద్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార దుకాణంలో చోరీ

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతి కాలనీలో గల ఓ స్వర్ణకార దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు నాంపల్లి మహేశ్ కథనం ప్రకారం.. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో నలుగురు దుండగులు షాపు వద్ద అనుమానాస్పదంగా ఉండడం స్థానికులు గమనించారు. మహేశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చిచూడగా దుకాణం షట్టర్ తాళాలు కోసి ఉన్నాయి. అప్పటికే దొంగలు లోనికి ప్రవేశించి దుకాణంలోని ఏడు గ్రాముల బంగారం, వెండి గొలుసులు, రాళ్లు కలిపి దాదాపు రూ.3 లక్షల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారని వాపోయాడు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. పక్క దుకాణంలో సైతం చోరీకి యత్నించగా తాళాలు తెరుచుకోలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

వన్యప్రాణుల నిలయం.. కవ్వాల్

వివిధ రకాల వన్యప్రాణులకు పుట్టినిల్లు కవ్వాల్ అభయారణ్యం. ఈ అడవిలో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, దుప్పులు, సాంబర్లు, కొండగొర్రెలు, జింకలు, నక్కలు, కుందేళ్లు, ముళ్లపందులు, పందులు లాంటి వన్యప్రాణులతో పాటు, పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, తోడేళ్లు, అడవి కుక్కలు లాంటి వన్యమృగాలు కూడా జీవిస్తున్నాయి. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయి. ఇందులో భాగంగా ప్రతీ సంవత్సరం అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహిస్తుండగా నేటితో ముగియనున్నాయి.

- అడవి జంతువుల రక్షణ అందరి బాధ్యత
- నేటితో ముగియనున్న వారోత్సవాలు


వన్యప్రాణులు

జన్నారం: కవ్వాల్ అభయారణ్యాన్ని 1965లో వన్యప్రాణుల విభాగం (వైల్డ్‌లైఫ్)గా ఏర్పాటు చేశారు. వాటి రక్షణకోసం 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని రూపొందించారు. పులుల సంఖ్య పెంచడానికి 2012లో నేషనల్ టైగర్ అథారిటీ, కేంద్ర ప్రభుత్వం కవ్వాల్ అభయారణ్యాన్ని పులుల రక్షిత ప్రదేశం (టైగర్‌జోన్)గా ఏర్పాటు చేసింది. కవ్వాల్ టైగర్‌జోన్ 893 చదరపు కిలోమీటర్లలో కోర్ ఏరియా, 1,123 చదరపు కిలోమీటర్లలో బఫర్ ఏరియాగా గుర్తించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా టైగర్‌జోన్ విస్తరించి ఉంది. ఇందులో వన్యప్రాణులు స్వేచ్ఛగా జీవించేందుకు అటవీశాఖ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఈ టైగర్‌జోన్ ఏర్పాటు నుంచి వన్యప్రాణులకు రక్షణ కవచంగా మారింది. కఠిన చట్టాలను అమలు చేయడంతో క్రమేపీ వన్యప్రాణుల వేట తగ్గుముఖం పట్టింది.


వన్యప్రాణుల కోసం పెంచుతున్న గడ్డి

గడ్డిక్షేత్రాలతో పెరిగిన సంఖ్య

జన్నారం అటవీ డివిజన్‌లో వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఐదేళ్లుగా అడవుల్లోకి పశువులు వెళ్లకుండా కట్టడి చేశారు. ఆహారం, ఆవాసం, నీరు కల్పించడం ద్వారా వన్యప్రాణుల సంఖ్య పెరిగే అవకాశం ఉందనే ఉద్దేశంతో జన్నారం డివిజన్‌లోని 40 బీట్‌లలో అవి ఇష్టపడే పలురకాల గడ్డిని పెంచడం, నీటి కుంటల నిర్మాణం, అలజడి లేకుండా ఆవాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల నిర్వహించిన శాఖాహార జంతువుల సర్వే ద్వారా వన్యప్రాణుల సంఖ్య రెట్టింపు అయినట్లు అధికారులు తెలిపారు. వన్యప్రాణుల సంఖ్య వివరాలను అధికారులు విడుదల చేయాల్సి ఉంది.

కఠినమైన చట్టాలు

వన్యప్రాణులను వేటాడినా వాహనంతో ఢీకొట్టి చంపినా 1972 ఆక్ట్ ప్రకారం 6 నెలల నుంచి ఎనిమిదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారు. షెడ్యూల్ 1 కిందికి వచ్చే పులి, చిరుత, ఎలుగుబంటి లాంటి జంతువులను వేటాడితే ఎనిమిదేళ్ల జైలుశిక్ష, షెడ్యూల్ 2 కిందికి వచ్చే జంతువులను వేటాడితే 6 నెలల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం



అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణుల చట్టాలు, శిక్షల గురించి సిబ్బంది అటవీ సమీప గ్రామాల్లో వివరిస్తున్నారు. విద్యార్థి దశనుంచే వన్యప్రాణుల చట్టాలు, రక్షణ గురించి తెలిసేందుకు పోటీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణులు, అడవులను రక్షించుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుంది. భవిష్యత్ తరాలకు ఈ వనసంపదను మిగిల్చిన వారమవుతాం.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో

వారోత్సవాలు

వన్యప్రాణుల రక్షణ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏటా అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నారు. జంతువులను వేటాడితే పడే శిక్షల గురించి వివరిస్తున్నారు. రెండేళ్లుగా కేసులు తగ్గుముఖం పట్టినా ఇటీవలి కాలంలో మళ్లీ పెరిగినట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్–19 కబడ్డీ పోటీల్లో 120 మంది క్రీడాకారులు పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 15 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు కార్యదర్శి బాబూరావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకు మహబూబాబాద్ జిల్లాలోని నర్సింహులపేటలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను డీఐఈవో అంజయ్య అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, యాకూబ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాజ్‌కిరణ్, ఆర్పీఏ మెంబర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్టు

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

బాసర: బాసర ఆర్జీయూకేటీ కళాశాలలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తపస్సుతో మహనీయుడుగా మారి ప్రపంచానికే జ్ఞాన జ్యోతిని చూపించిన కారుణ్యమూర్తి వాల్మీకి అన్నారు. ఆయన జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విట్టల్, డాక్టర్ మహేష్, డాక్టర్ నాగాంజనేయులు, డాక్టర్ దేవరాజు, డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నాగసాయి, బద్రి హరికృష్ణ, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్

గూడెంలో పౌర్ణమి జాతర

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం అశ్వియుజ పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. జిల్లాతో పాటు, పక్క జిల్లాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.


సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

చికిత్స పొందుతూ మహిళ మృతి


లలిత (ఫైల్)

నెన్నెల: ఈ నెల 6న మండలంలోని గుండ్లసోమారంలో పెట్రోల్ మీదపడి నిప్పంటుకోవడంతో గాయాలపాలైన జాడి లలిత (40) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మహిళ భర్త జాడి రాజన్న సోమవారం ఉదయం ఇంట్లో బ్యాటరీ స్ప్రే డబ్బాకు మరమ్మతులు చేస్తుండగా అందులో ఉన్న పెట్రోల్ పొయ్యి వద్ద ఉన్న లలితపై పడడంతో నిప్పంటుకుంది. కాపాడబోయిన రాజన్న కూడా గాయాలపాలయ్యాడు. తీవ్రంగా గాయపడిన లలితను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. రాజన్న మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి సోదరుడు దుర్గం రాజారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

డీజే నిర్వాహకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన నిర్వాహకులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రిమ్స్ ఎదుట భుక్తాపూర్‌కు చెందిన గాజగూడ శ్రీనిద్, నీలానగర్‌కు చెందిన లఖన్, గోపాల్, తిలక్‌నగర్‌కు చెందిన బక్కి రవీందర్, సతీష్‌తో పాటు మరికొంత మంది డీజేలను నిర్వహించారని తెలిపారు. పోలీసులు చెప్పినప్పటికీ వినిపించుకోకుండా పరిమితికి మించి డీజే సౌండ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమించే డీజే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా డీజేలను ఏర్పాటు చేయవద్దని సూచించారు.

రోడ్డుపై ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మున్సిపాలిటీ అనుమతి లేకుండా రోడ్డుపై ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన నేస్తం ఫౌండేషన్‌కు చెందిన వంశీపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని ఇదివరకే సూచించినప్పటికీ కొందరు నిబంధనలను పాటించడం లేదన్నారు. నిబంధనలను అతిక్రమించి ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుండడంతో ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ అనుమతి ఉంటేనే వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. హెచ్చరిక బోర్డులు ఉన్నచోట ఎలాంటి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దన్నారు.

గవాయ్‌పై దాడి హేయమైన చర్య

మంచిర్యాలక్రైం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి హేయమైన చర్యగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ములకల్ల రాజేంద్రప్రసాద్ అభివర్ణించారు. దాడి ఘటనపై జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు కాదాశి రవీందర్, ఉపాధ్యక్షుడు నాగుల కిరణ్‌బాబు, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, బూడిద మల్లేష్, కృష్ణ చైతన్య, బాంసేపు నాయకులు శంకర్, శెట్టి పాల్గొన్నారు.

స్టాఫ్ సెలక్షన్ ఫలితాల్లో ప్రతిభ

- వరుసగా రెండు ఉద్యోగాలకు ఎంపిక


జే.భరత్ కుమార్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని జీఎన్‌ఆర్ కాలనీకి చెందిన జే.భరత్ కుమార్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఫలితాల్లో సత్తాచాటి కేంద్ర ప్రభుత్వ మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. జందే లక్ష్మి–స్వామి దంపతుల కుమారుడైన భరత్ కుమార్ హైదరాబాద్‌లో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి కొన్నేళ్లుగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. గత ఆగస్టులో ఆర్కియాలజీ శాఖలో కన్జర్వేషన్ అసిస్టెంట్‌గా ఎంపికై కర్ణాటక రాష్ట్రంలోని హంపి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. తాజాగా సోమవారం విడుదలైన స్టాఫ్ సెలక్షన్ ఫలితాల్లో ఆలిండియా ఓబీసీ విభాగంలో 37వ ర్యాంకు సాధించాడు.

మరో సైబర్ మోసం

- ఖాతాలో నుంచి రూ.62,191 నగదు మాయం



ఆదిలాబాద్‌టౌన్: రోజురోజుకూ సైబర్ మోసాలు పెరుగుతూనే ఉన్నాయి. తెలిసినప్పటికీ కొంతమంది వారి వలలో చిక్కుతున్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఖాతా సమాచారం ఇవ్వవద్దని చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. తీరా డబ్బులు పోగొట్టుకున్న తర్వాత లబోదిబోమంటున్నారు. ఇలాంటిదే జిల్లా కేంద్రంలోని పాత హౌజింగ్ బోర్డులో సంఘటన చోటు చేసుకుంది. ప్రభుత్వ ఉద్యోగి గాలి ప్రవీణ్ కుమార్ గత నెల 26న తన స్నేహితుడికి ఫోన్‌పే ద్వారా రూ.3,900 నగదు పంపించాల్సి ఉండగా పొరపాటున మరోవ్యక్తికి ఆ డబ్బులు వెళ్లాయి. ఆ డబ్బులు తిరిగి రాబట్టుకునేందుకు గూగుల్‌లో సెర్చ్ చేశాడు. అందులో 7303238726 నంబర్‌కు ఫోన్ చేశాడు. రీఫండ్ చేస్తామని నమ్మించి నాలుగుసార్లు అతని ఖాతాలో నుంచి మొత్తం రూ.62,191 నగదు కాజేశారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య


గణేశ్ (ఫైల్)

కుభీర్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు కుభీర్‌కు చెందిన ముచ్చిన్ల గణేశ్ (23) కొంతకాలంగా ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా భైంసా ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి తల్లి, అక్క ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


దిగువకు వెళ్తున్న వరదనీరు

స్వర్ణ ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తివేత

మండలంలోని ఆయా గ్రామాలతో పాటు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి అధికారులు స్వర్ణ ప్రాజెక్టు నాలుగు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు కాగా అర్ధరాత్రి ఒక్కసారిగా ఇన్‌ఫ్లో 15,200ల క్యూసెక్కులు పెరగడంతో అధికారులు ఒక్కొక్కటి చొప్పున నాలుగు వరదగేట్లను పైకెత్తి దిగువకు అంతేమొత్తంలో నీటిని విడుదల చేశారు. – సారంగపూర్

కోతుల బెడదకు కొట్టేస్తున్నారు..!


శాస్త్రినగర్‌లో రోడ్డు పక్కన నరికేసిన చెట్టు


గొల్లపేట్ కాలనీలో చెట్టుమాను

జిల్లా కేంద్రంలో రోజురోజుకూ కోతుల బెడద పెరిగింది. ప్రకృతి ప్రేమికులు ఎంతో ప్రేమగా ఇళ్ల ముందు పెంచుకున్న చెట్లపై కోతులు గుంపులు గుంపులుగా వచ్చి స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అంతేకాకుండా రోడ్లపై వెళ్లేవారిని కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల బారినుంచి తప్పించుకునేందుకు ఇంతకాలం ప్రేమగా పెంచుకున్న చెట్లను ఇలా నరికేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

'ప్రాణహిత'ను పరిశీలించిన నీటిపారుదల శాఖ అధికారులు

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిని రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. గతంలో ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదిత స్థలం, ప్రస్తుత ప్రతిపాదిత స్థలంపై అధికారులు మ్యాప్‌తో ఆయనకు వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత వివరాలపై అధికారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వైన్‌గంగ, వార్ధా నదుల సంగమంతో తుమ్మిడిహెట్టి వద్ద ఏర్పడే ప్రాణహిత సంగమంను ఆయన బైనాక్యులర్‌తో వీక్షించారు. బ్యారేజీ నిర్మాణం చేపట్టే ప్రదేశాన్ని చూశారు. ప్రాణహిత నది నీటి లభ్యత, ప్రాజెక్టు విధివిధానాలపై సమగ్ర వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ సత్యరాజచంద్ర, ఎస్ఈ రవికుమార్, ఈఈ ప్రభాకర్, తహసీల్దార్ ప్రమోద్‌కుమార్, డీఈ వెంకటరమణ, భానుమూర్తి, భద్రయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


ప్రాణహిత బ్యారేజీ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రశాంత్ జీవన్ పాటిల్

మెరుగైన విద్యుత్ సేవలు అందించాలి

- టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో విద్యుత్ వినియోగం వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్త విద్యుత్ ఉపకేంద్రాలు, విద్యుత్‌లైన్లు అవసరముంటే ప్రతిపాదనలు పంపాలన్నారు. అటవీ ప్రాంతాల్లో నూతన విద్యుత్ కేంద్రాల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర నిర్మాణాల విషయంలో అటవీ అనుమతులు వీలైనంత త్వరగా పొందాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి అంచనాలు సిద్ధం చేసి నివేదికలు పంపాలని సూచించారు. స్థల సేకరణ వేగంగా పూర్తి చేసుకోవాలన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని, రైతాంగానికి, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజలకు, రైతాంగానికి అనవసర కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ మరమ్మత్తులు, విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా భద్రతా పరికరాలు ధరించాలన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

కొలాం వీరుడు సూరుకు నివాళి


నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే, పీవో


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన అమరుడు కుమురం భీంకు పోరాటంలో సహాయ సహకారాలు అందించిన కొలాం వీరుడు కుమురం సూరు 28వ వర్ధంతిని మంగళవారం జోడేఘాట్‌లో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. వారసులు పాండు, రాజు, ధర్మూ, భీంరావు జెండాలు ఎగురవేసి పూజలు చేశారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఆర్డీవో లోకేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, డీడీ రమాదేవి, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప సూరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పూజల్లో పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో దారి విషయంలో ఈనెల 5న జరిగిన గొడవలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నరేందర్, రాజ్‌కుమార్‌ల మధ్య జరిగిన గొడవలో ఇరువర్గాలకు చెందిన అరుణ్, దినేష్, హారీష్, పరమేశ్, శ్రీకాంత్, చింతల కృష్ణ, ఆవునూరి రమేశ్, వినయ్, అవినాశ్, చందు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు పది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

'9న సమావేశం విజయవంతం చేయాలి'

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండల కేంద్రంలో ఈ నెల 9న నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, జగిత్యాల జిల్లాల కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దుర్గం నూతన్ కుమార్